"నాకు కావాలసినన్ని రవికెలున్నాయి. అక్కర్లేదు."

"నువ్వు కొయ్యపోతుమనిషివి. నిన్నడగడం నాదే బుద్ధిపొరపాటు. లెంపలువాయించుకుంటున్నా. (లెంపలు వాయించుకొని వెళిపోతాడు.)

# అన్యోన్య దంపతులు

## ౧

"ఓయ్! తలుపుతియ్యి!"

"వచ్చె"

"… … … …"

"(తలుపుతీసి) పిల్లాడు చాటలోపిండి కిందపారపోస్తున్నాడు. అదితీసి దాచివచ్చాను."

"అంత పెంకితనం చేస్తున్నాడూ!"

"అంతా యింతానా!"

"అయితే శిక్ష వేస్తాను."

"ఏం శిక్ష వేస్తారు?"

"చూద్దూగానిగా."

"అయినా చెప్పండి"

"వాడిచేత నిన్ను నాలుగు తన్నిస్తాను."

"మంచిశిక్షే! పోనీ మీరు తినండి."

"నేనుతిన్నా నువ్వుతిన్నా ఒకటేగా!"

"అంచేతే మీరుతినడం."

" అందుకే నువ్వుతినడం......ఏడీ తండ్రేడీ, వెర్రితండ్రి [పిల్లవాణ్ణిఎత్తుకుని] ఇదేమిటే అసహ్యంగా వున్నాడు."

" ఇవాళ తలదువ్వి మొహంకడగ లేదు."

" ఎప్పుడూ పిల్లాణ్ణి అపరిశుభ్రంగావుంచకు. నా కసహ్యం. [మంచంమీద పడుక్కుంటాడు]."

" ఏమండీ మరి మా అమ్మదగ్గిర నుంచి ఉత్తరం—"

" ఇప్పుడు నన్నేమీ మాట్లాడించకు. ఆఫీసునుంచి వచ్చాక కాస్సేపు ఊరికే పడుక్కుంటేగాని ఒళ్లూ, మనసూ స్థిమితపడవు. భోంచేశాక కావలసినన్ని అడుగు చెప్తాను."

" అలాగే."

౨

" ఆఫీసువేళయిపోయింది, వేగిరం వడ్డించు."

" మొదట మీరు భోంచేశాక నేను దేవుడికి నైవేద్యం పెట్టుకుంటా, రండి"

" నావంతు నేను నైవేద్యం పెట్టుకుంటా, నీవంతు నువ్వు పెట్టుకో."

" (వడ్డిస్తుంది) కూచోండి."

" (తిని) పప్పులో ఉప్పెక్కువయింది,"

" ఎంత జాగ్రత్తగా చేసినా ఏదోవొకటి వస్తూనేఉంటుం దమ్మా."

" ఏదో పొరపాటురాకుండా పనులు జరుగుతాయేమిటి."

" రేపటినుంచి తక్కువ పారేస్తూఉంటాను."

" ఊఁ."

" ..............."

" ఏదీ ఆధరువులు మరి రెండు చేశావు కావేం. రెండు ఒకటి

చెయ్యకపోయినా, ఒకటి రెండుచేస్తూ ఉండు. ఇలాగ వంకాయి కూర చేసినప్పుడు అందులోదే కొంతతీసి పెరుగుపచ్చడో, పులుసు పచ్చడో చేస్తూఉండు. పొట్లకాయకూర చేసినప్పుడు అందులోదే కాస్తతీసి పెరుగుపచ్చడి చేస్తూఉండు. పిండ్లన్నీ చేసి ఉంచమన్నానే. పెసరపిండి, మినపపిండి, సెనగపిండి ఇలాంటివి. సుళువుగా పచ్చళ్ళు చేసుకుంటూ ఉండొచ్చు. మన తెలుగు వాళ్ళతిండి అసలే బలహీనమయింది, తక్కిన దేశస్థులందరి తిండి లాగాగాక, అందులో ఇలాంటివికూడా లేకపోతే ఇంక చెప్పే దేమిటి.''

"అలాగే చేస్తానులెండి. దేనికయినా పిల్లా డొకడు అడ్డొస్తూఉంటాడు.''

"మడి మడి అని గింజుకోకుండా ఉంటేసరి. పిల్లాడు అడ్డొచ్చినా ఫర్వాలేదు. పిల్లాడు మధ్యాహ్నం పడుక్కున్నప్పుడు ఇలాంటివి చేసుకోవచ్చు. మడి ఏడవకపోతే, ఇలాంటివన్నీ ఇట్టే జరుగుతాయి.''

"ఊఁ.''

"మజ్జిగ పోసెయ్యి పోవాలి.''

3

"పిల్లాడికి శైత్యంచేసిందేం ?''

"ఏమో !"

"వానలో తిరిగా డేమిటి.''

"నేనేదో పనిచేసుకుంటూంటే, వాడు వీధిలోకి పరిగెత్తాడు, అప్పటికీ వెంటనే తీసుకొచ్చాను.''

"మంచిపనే. కొంచెం జాగ్రత్తగాచూడు. శైత్యం తగ్గే వరకూ అశ్రద్ధ చెయ్యకు. జబ్బులోకి దింపేను.''

"అలాగే"

"... ... ... ..."

"ఉత్తపుణ్యానికి ఎదుటింటి ఆవిడ నన్ను తిట్టడం మొదలెట్టిందండీ."

"ఎందుకూ ?"

"ఏమో !"

"కారణం లేకుండా తిడుతుం దేమిటి."

"ఉత్తపుణ్యాని కంటూంటేనే."

"అయితే నువ్వేంచేశావు. నువ్వూ తెగతిట్టావా ?"

"తిట్టనూ ! తిట్టక ముద్దిస్తానేమిటి ?"

"అయితే నీబుద్ధేం మహాఇదయి పోయిందని చెప్ప వచ్చావు"

కారణం లేకుండా తిడుతూంటే ఎలాగ ఊరుకోనండీ ! నేనూ పడతిట్టాను.

"కారణం లేకుండా తిట్టినప్పుడు, నిన్ను కాదని ఊరుకోవద్దూ. నువ్వు ఊరుకుంటే ఆవిడ ఎంతసేపు తిడుతుంది ?"

"ఎంతసేపేమిటి ఆడదానికి."

"ఊరికే గొడ్డులాడులా అరిస్తే నలుగురూ ఆవిడనోట్లోనే గడ్డి పెడతారు."

"అదేమిటండి అలాగంటారు."

"అయితే నన్ను కూడా అందుకుని ఆవిడతో జగడమాడ మన్నా వేమిటి."

"లేకపోతే ఎలాగండీ."

"చాలా బుద్ధిమంతురాలివే. ఇంకేం చాలా బాగుంది, నీకు బుద్ధిలేకపోగా నాకు కూడా ఉండకూడదంటావు. అంతేనా నువ్వనేది."

"మీరు ఊరుకుంటే ఎలాగండీ, నన్ను ఉత్తరువ్యానికి తిడితేనే"

"నేను చెప్పనేచెప్పానుగా. ఊరుకుంటే మరింక తిట్టదని."

"మంచి సలహాయే చెప్పారు."

"అయినా ఈమారు చేసి చూద్దూ, నా మాటవిని"

"అదీ చూద్దురుగానిగా."

"ఆఁ చూస్తాను."

౪

"ఇదిగో!"

"ఊఁ."

"ఇవాళ నాటకానికి వెళ్ళాలి."

"నేనలాగ స్వతంత్రించి చెప్పగలనా, మీ అనుజ్ఞ తీసుకోవాలి, అప్పుడు వెళ్ళాలి."

"అంటే నువ్వనడం, నీఅనుజ్ఞ తీసుకుని నన్ను వెళ్ళమనా, లేక నాకుచెప్పకుండా నువ్వు నాటకాలికి వెళ్ళకూడదా అనా."

"అదీకాదు, ఇదీకాదు."

"మరి."

"మరి నన్నుకూడా నాటకానికి తీసుకువెళ్ళమని."

"దానికేనా అలాగన్నావు."

"అలాగనకపోతే తీసికెళతారా?"

"తీసికెళతానో లేదో మరి నిలిచిచూశావుకాదు."

"ఈ ఒక్కమాటేనా నిలిచిచూడనిది."

"అలాగంటేనే నాకు ఒళ్లు మండుకొస్తుంది. ఇంక అసలే తీసికెళ్ళను."

"లేదులెండి ఊరికే అన్నా."

" వేగిరం పనులుచేసుకో మరి, పోదాం. "

" ఊఁ, నిమిషాలమీద . . . . . ఊళ్ళో విశేషాలేమిటండీ. "

" ఏం చెప్పమన్నావు కవి సన్మానా లెక్కువయిపోతున్నాయి "

" కవయిత్రి సన్మానాలుకూడా ఉన్నాయా? "

" కవయిత్రులుంటే ఉండకేం. "

" మొగాళ్లు ఉండనిస్తారా. ఆడాళ్లు చదువుకోకూడదుకా "

" మీనాన్న చదువుచెప్పిస్తే నువ్వొంతదానివేనా అవుదువు. "

" నాకు చదువూవద్దు చట్టుబండలూ వద్దు. అన్నీ మీరే— "

" ఇప్పుడంతే అయిపోయిందిలే. "

" అసలు ఎప్పుడేనా అంతే అవడమే కోరుకుంటాను. "

" మరి కవయిత్రులో. "

" నేనవకపోతే మునిగిపోయిందేమిటి లెండి. ఇప్పుడు చదువుకొన్న వాళ్లందరినీ అవనిద్దురూ చాలు. "

" ఔను ! "

" ఊళ్ళో విశేషాలు చెప్పరూ. "

" వేగిరం నాటకానికి తెమలాలి, రేపు చెప్తాను. "

" ఊఁ. "

౨౪

" ఎవరండీ మీకోసం వచ్చారు ? "

" నేనూ అతనూ చిన్నప్పుడు ఒక్కక్లాసులోనే చదువుకున్నాం. ఇప్పుడతను ఇక్కడ కాలేజీలో లెక్చరర్‌గా ఉంటున్నాడు. నెలకి రెండు వందల రూపాయిలు జీతం, అతనూ. "

" అదృష్టవంతుడే. "

" అందరూ నాలాగే ఉంటా రేమిటి ? "

" అలాగంటేనే నాకువొళ్ళు మండుకొస్తుంది. "

" లేదు లే. ఇదిగో నేనలాగువెళ్ళాలి, పనివుంది. అర్జంటుగా వెళ్ళాలి. "

" ఎక్కడికి వెళ్లాలి. "

" మా స్నేహితుడు సుబ్బారావుతో వస్తానని చెప్పాను. ఇద్దరంఏదో ఒకపని తలపెట్టాము. "

" ఏమిటో చెప్పండి. "

" నీచెవిని పడందే జరుగుతుందేమిటి ? తర్వాత చెస్తానులే తిరిగివచ్చి. "

" ఊఁ వెళ్ళిరండి. "

౬

" జ్వరం బాగానే ఉందండీ. అయినా చెయ్యి చూడండి. "

" (చూసి) ఏమంత ఉందిలే. అయినా వైద్యుడు మంచి మందు ఇస్తూనే ఉన్నాడు. "

" ఉత్తనే పక్కమీద పడుక్కుంటే ఏమీతోచకుండా ఉందండీ. ఎప్పుడూ ఏదో వొకటి చేస్తూఉండేదాన్ని. కాళ్ళూ చేతులూ కట్టేసినట్టుగా పడుకోక్కమంటే పడుకోగలనా ? "

" అలా పడుక్కుంటేనే జ్వరం తగ్గుతుంది. లేకపోతే వేగిరం తగ్గనే తగ్గదు. "

" మీరు ఇలాకూచోండి, కొంచెంసేపు కూచునివెళుదురు గాని. "

" ఊఁ (కూచుంటాడు.) "

" ఎమండోయి ! మొన్న నీమధ్య ఎదుటింటావిడ మళ్ళీ తిట్ట డం మొదలెట్టిందండీ. "

" నువ్వేం చేశావ్ ? "

"మీరుచెప్పినట్లే ఊరుకున్నాను, నామీద కారణ లేనప్పుడు నన్ను తిడుతూందనే అనుకోడ మెందుకని."

"ఊఁ."

"నలుగురూ నోట్లోగడ్డిపెట్టారు ఆవిడికి, ఉత్తపుణ్యాని కెందుకు తిడతావమ్మా అని."

"నేను చెప్పనే చెప్పానుకా."

"ఔనుగాని నామీద కారణమున్నప్పుడు తిడితే ఏంచెయ్యమన్నారు."

"తెలియక తప్పుచేశానమ్మా. అప్పుడు నావల్ల తప్పేవొచ్చిందమ్మా అనేసి ఊరుకోవాలి."

"బాగానేవుంది."

"మరి నేను వెళతాను, ఇంట్లో పనులుకూడా చేసుకోవాలి."

"ఊరికే పడుక్కుంటే ఏమీతోచదండీ. చదువుకోకూడదంటారు, పనులుచెయ్యకూడదంటారు."

"దేవుణ్ణి స్మరిస్తూ పడుక్కో. దాంతో వూసుపోతుంది."

"ఊఁ"

౭

"ఇక్కడ ఈఅద్దం బద్దలయి కిందబడిపోయిందేం"

"బల్లమీద ఉన్న తువ్వాలుతీస్తూఉంటే దానికిది తగులుకుంది కామోసు, కిందపడిపోయింది"

"కాళ్లలో పెంకులుగుచ్చుకుంటాయి. జాగ్రత్తగా తుడిచి అవతల పారపోసెయ్యి. ఆ అద్దంపోవడం మనస్సుకి కొంచెం విచారంగాఉంది సుమా. అద్దం పోయిందనికాదు. అదిపోతే మళ్ళీ అర్థరూపాయిపెడితే మరోటి ఇట్టేవస్తుంది. అద్దంకోసమని కాదు. ఈఅద్దం నాలుగేళ్ళనుంచి ఉంది నాదగ్గిర. పరిచయ

దోషంవల్ల కొంచెం విచారంగా ఉంది."

"నాకుకూడా అలాగే అనిపించిందండీ."

"................"

"................"

"ఈ లాంతరుకి చిమ్నీ లేదేం."

"చిమ్నీ తుడుస్తూఉంటే పిల్లాడు వెనకనుంచి చెయ్యి వేసేశాడు, కిందపడి బద్దలయిపోయింది"

"ఇవాళకా కెంపో లాంతరుతో కాలక్షేపం చెయ్యి. రేపు కొని తెస్తాను."

"అలాగే."

"నేను అరిటిపళ్లు తెచ్చిపెట్టాను, చూశావా?"

"నేను రెండుతీసుకొన్నానండీ."

"నీకూ నాకూ అనే ఆపళ్లు తెచ్చాను, మరో రెండు అన్నంలో వేసుకుందూగాని"

"నావంతు మూడింటిలో రెండయిపోయాయి. ఇక ఒకటే ఉంది"

"అయితే నావంతులో రెండు తీసుకో"

"ఇంక వంతనే దేముంది"

"అదే నేనుచెప్పడం. నీకు కావలసినవితీసుకో"

"ఇంకా ఎక్కువ తింటే ఏమేనా చేస్తుందిబాబూ."

"అయితే వద్దులే."

౨

"ఇదిగో నేనిప్పుడే చూశానింకా. ఇదిగో ఈ మల్లెతీగ చూశావూ రెండు మొగ్గలెట్టింది."

"మీ కెక్కడ కనబడ్డాయండీ! నేను రోజురోజూ దాని

ఆకులన్నీ వెతికిచూస్తానుకదా, నాకు కనపడ లేదు."

"నామాట అబద్ధమయితే ఇలా వచ్చిచూడు."

"ఇదిగో వస్తున్నాను. [వెళ్ళిచూసి] ఔనండీ! బాగానే ఉన్నాయి. పిల్లాడు పుణికెయ్యకుండా ఉంటే అంచక్కా పువ్వులవుతాయి,"

"వాడికి తప్పని చెప్పు పుణికెయ్యడు"

"తప్పనిచెప్పకే చేమిటి వాడుచేసేతప్పుపనులన్నీను, పోనీ ఆకులచాటునదాచు ఈ మొగ్గల్ని"

"అలాచేస్తే యింకామంచిది."

"మొన్న మంచిరకం గులాబీఅంట్లు తెచ్చియిస్తానన్నాడు. మా ఆఫీసు బంట్రోతు"

"పూలకుండ్లు ఉంటూవుంటే ఇల్లూ పెరడూకూడా ఎంతో అందంగా ఉంటాయిసుమండీ"

"అందుకనే వెయ్యడం."

"మననిచూసి సూరమ్మగారు కూడా కుండ్లు తెప్పించి మొక్కలువేసింది."

"చూడడానికి అందంగాఉంటుంది."

"ఆవీధిలోఉండే అరవవాళ్ల ఇంట్లో యెన్నేనా కుండ్లు ఉన్నాయి సుమండీ."

"ఔను!"

"మరి నాలుగుకుండ్లు తెప్పించి, అక్కడక్కడ పెడతాను."

"తెప్పించు"

౭

"ఏమిటండీ సంఘసంస్కరణ, సంఘ సంస్కరణ అంటూ ఉంటారు, నాకేమీ చెప్పరేం?"

"చెప్పడానికేముంది, చెయ్యడంలోవుంది కాని"

"అయినా చెప్పదురూ చూద్దాం"

"చెప్పినట్టు చేస్తావా చెప్తాను"

"మంచిదయితే చేస్తాను"

"మంచిదికాకపోతె నేనుమట్టుకి చెప్తానేమిటి ?"

"అయితే చేస్తాను"

"వ్రతాలూ నోములూ చెయ్యడం మానమంటాను చేస్తావా ?"

నేన్నై మానను.

"అయితే నేచెప్పేదేమిటి ?"

"అలాంటివిచెప్తే ఎవరేనా చేస్తారేమిటి ఎక్కడేనా"

"అయితే ఎలాంటివి చెప్పాలి."

"ఎలాంటివీ లేదు."

"పోనీ వ్రతాలు, నోములలో ఉండే చెడ్డ చెప్తాను మాన్తావా ?"

"చెప్పండి చూతాం"

"విను అయితే"

"ఈవ్రతాలెందుకుకల్పించారో తెలుసానీకు"

"ఊఁ చెప్పండి."

"మునుపు త్రిపురాసురులనే రాక్షసులుండే వారు. వాళ్ళు లోకాన్ని ఎంతనాశనం చేస్తూన్నా వాళ్ళని జయించడానికి ఎవరి తరమయేది కాదు. ఎంచేతంటే వాళ్ళ ఆడవాళ్లు అంత పతివ్రతలు. అప్పుడు దేవతలందరూ కలిసి ఆలోచించారు. విష్ణుమూర్తి ఒక ఉపాయంచెప్పాడు. నారదుణ్ణి తనకు శిష్యుడుగా ఉండమన్నాడు. తాను మునీలి ఫురోహితుడి వేషం వేసు

గున్నాడు."

"ఊఁ"

"తర్వాత వాళ్ళిద్దరూకూడా ఆవేషం వేసుకుని త్రిపురానికి వెళ్ళారు. నెమ్మదిగా అక్కడ చేరారు. నారదుడిసాయంవల్ల క్రమేపీ అక్కడి స్త్రీలంతా పురోహితుడి దగ్గరికిచేరారు. ఆటు తర్వాత పురోహితుడు వాళ్ళకి ఉపదేశంచేశాడు. ఏమిటంటే, అనేకవ్రతాలు చెయ్యండని. అప్పుడు వాళ్ళు ఆవ్రతాలు చేస్తూ పతులమాటే తలపెట్టేవారు కారు. ఈమోస్తరుగా వాళ్లలో పతిభక్తి తగ్గిపోయేటప్పటికి, శివుడు సుళువుగా త్రిపురాసురుల్ని చంపేశాడు. ఇదీ కథ, వ్రతాలెందుకు సృష్టించబడ్డాయో విన్నావా?"

"వ్రతాలింత చెడ్డవిటండీ!"

"పతివ్రతాత్వం పోగొట్టడానికి ఈ వ్రతాలు కల్పించబడ్డాయి"

"అయితే మానెయ్యవలసిందే"

"తెలిశాకకూడా ఇంకా చేస్తారా?"

"మరయితే నోములో"

"వ్రతాలికి అక్కచెల్లెళ్ళునోములు"

"మరి నోములవల్ల ధర్మంచేసుకుంటూ ఉంటూండడమవుతుంది కాదుటండీ."

"అంటే నోములు లేకపోతే ధర్మం చెయ్యకూడదనా, మా మొగాళ్ల కేనోములున్నాయి, ధర్మం చెయ్యడానికి"

"లేవులెండి"

"ధర్మం చెయ్యడంలేదూ?"

"లేకేం"

"ధర్మం చెయ్యడం నేర్చుకోవాలిగాని విచారణ శక్తి ధ్వంసంచేసే నోములను ఏర్పాటుచేసుగుని ధర్మం చేస్తున్నామని అనుకుంటూ ఉండకూడదు."

"అలాగే. కొన్నికొన్ని మరీమరీ చెడ్డనోములండీ. అవి చెయ్యడంలో ఏమీ బుద్ధిఉన్నట్టు కనబడదు. ఉసిరికాయదానం, పేడదానంకూడాను"

"అందుకనే ఇంక అవిఅన్నీ మానేసి బుద్ధి ఉపయోగించి పనులుచెయ్యి"

"అలాగే చేస్తాను."

౧౦

"ఏమిటా కాగితపు పొట్లాలు"

"అయినా చెప్పకో"

"ఏమిటో మీకోసం పంచెలు కొనుక్కు తెచ్చుకున్నారు కామోసు"

"అయినా విప్పి చూడు"

"(విప్పిచూసి ఆశ్చర్యపడి) ఇప్పుడెందు కండీ, కొని తెచ్చారు. నాకుచెప్పనేనా చెప్పారా, ఇలా కొని తెస్తానని వద్దనేనా చెప్పే దాన్ని"

"నిన్నడిగితే గదూ ఏంచెప్పడానికీ!"

"అయ్యో! ఎందుకు కొని తెచ్చారండీ"

"ఖద్దరులో చక్కని రకాలొచ్చాయిగ చీరల్లో. అందుకని కొని తెచ్చాను. ఈ కొత్తరకాలు చాలాబాగాఉన్నాయి"

"మంచీమాటే మీకుకూడా కొని తెచ్చుగో లేకపోయారా?"

"కావలసినన్ని ఉంటూంటేనే"

“ అయితే నాకేనా లేకపోయేను. మీరుకూడా కొని తెచ్చుకుంటేగాని నేను ఒప్పుకోను ”

“ అలాగేచూద్దాంలే ”

“ చూద్దాంకదూ. ”

---

# * సహగమనం

[మూరెళ్ళ క్రిందట]

♦ ‘ ఏమిటోయ్ ! తెగ నవ్వుకుంటున్నావు. కడుపు చేత్తో పట్టుకు నవ్వుకుంటున్నావులే. పక్కలు పీకెట్టేను సుమా. బోర్లా పడి మొహం బద్దలుచేసుకుంటావు! ’

‘నేనే కాదు ఈకాగితం నువ్వు చదివినా అంతే చేసుకుంటావు ’

‘ ఏమిట్రా కాగితంచూసి నవ్వుకుంటున్నావుట్రా ! చాలా తెలివైన వాడివే ! ’

‘ నేను చెప్పానుగా ఈ కాగితం నువ్వుచదివినా అంతే చేసుకుంటావని ’

‘ ఏమిటీ, అయితే చదువు చూదాం ’

‘ మొదట నీ కదురు తీసి అవతలపెట్టు. తరవాత దంజాలు వడుక్కుందుగానిలే. ’

‘ అలాగే. నువ్వు చదువుదూ మొదట. ’

---

* వీణ మార్చినుండి జూన్ 1938; ‘సాహిత్యం’ విజ్ఞానదీపిక రజతోత్సవ సంచికలో అచ్చయింది.

♦ మామా అల్లుళ్ళమధ్య సంభాషణ